క్లుప్తంగా

మునగాల తహసీల్దార్‌గా ఆంజనేయులు


ఆంజనేయులు

మునగాల : మండల తహసీల్దార్‌గా వలిగొండ ఆంజనేయులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాప్రతినిధులు, నాయకులు సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

మీడియా అకాడమీ నుంచి రూ.లక్ష ఆర్థికసాయం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు తులసిదాస్ ఇటీవల ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మీడియా అకాడమీ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తులసీదాస్ భార్య విజయకు అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీ మారుతీ సాగర్, జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్యయాదవ్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ


బుర్ర ప్రమోద్‌రెడ్డి అందజేసిన స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

మోతె : మండల పరిధిలోని తుమ్మగూడెంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం బొర్ర వెంకటరెడ్డి మెమోరియల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ బుర్ర ప్రమోద్‌రెడ్డి బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గద్దె వెంకట నర్సింహారావు, గ్రంథాలయ చైర్మన్ రహీం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన


కాల్వపల్లితండాలో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నట్లు ఎంపీడీఓ మామిడి జానకిరాములు తెలిపారు. బుధవారం మండలంలోని అల్లీపురం, కాల్వపల్లి తండా, లాలితండా గ్రామ పంచాయతీలలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, జైసన్ రాజు, ఉమ, తదితరులు ఉన్నారు.

సాగునీరు రాక రైతుల ఇబ్బందులు

హుజూర్‌నగర్ : నాగార్జున సాగర్ నుంచి సాగు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు దుగ్గి బ్రహ్మం అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో బోర్లు, బావుల కింద నాట్లు పూర్తయి రోజులు గడుస్తున్నా నేటికీ సాగు నీరు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగిరెడ్డి, నరేందర్‌రెడ్డి, రాము, పి.వెంకటరెడ్డి, సైదులు, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, రజనీ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలి

మోతె : రెండున్నర దశాబ్దాలుగా విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తున్న డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం నామవరం, సిరికొండ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో ఆహ్వాన కరపత్రాలు ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అక్టోబర్ 12, 13 తేదీల్లో మహా సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సింహాద్రి, రమేష్, అనంతుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పరిధిలో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం హుజూర్‌నగర్ మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన గల్లా ఉపేందర్ –శ్యామల దంపతుల కుమార్తె హర్షవర్ధని పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి, దాతల బంధువులు పాల్గొన్నారు.

'చంద్రయాన్-3' సంబరాలు


కోదాడ : సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు


నేరేడుచర్లలో సంబరాలు జరుపుకుంటున్న ప్రజలు

హుజూర్‌నగర్ : అంతరిక్ష పరిశోధనలో ప్రపంచ దేశాలలోకెల్లా భారతదేశం ముందంజలో ఉందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. చంద్రయాన్- 3 విజయవంతం కావడంతో బుధవారం హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమర్‌గౌడ్, గుండా బ్రహ్మ రెడ్డి, గుండా ఫణి రామ్ రెడ్డి, ప్రదీప్ గౌడ్, మధు, రామకృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ : చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో కోదాడ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నేరేడుచర్ల పట్టణ వాసులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యారవ సురేష్, శ్రీనివాస్, సుబ్బారావు, నాగరాజు, రామిరెడ్డి, నాగయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్, వెంకయ్య, ఉపేందర్, భాస్కర్, సతీష్ తదితరులు ఉన్నారు.


చిలుకూరులో..

చిలుకూరు : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం చిలుకూరులో జాతీయ జెండాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించేలా చూడాలి


ఆర్.కృష్ణయ్యతో బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి శ్రీనివాసనాయుడు, తదితరులు

కోదాడరూరల్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు టికెట్ల కేటాయింపులో సముచిత స్థానం కల్పించే విధంగా అన్ని పార్టీలపై ఒత్తిడి తేవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి శ్రీనివాసనాయుడు కోరారు. ఈమేరకు బుధవారం సూర్యాపేటలో ఆర్. కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలన్నారు. బీసీ కులాలకు లక్ష రూపాయలు కాకుండా బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి రూ.10 లక్షలు ఇచ్చే విధంగా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ, పాలంపల్లి సుధాకర్‌గౌడ్, పాశం వంశీయాదవ్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వసతిగృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారి

మునగాల : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.రవీందర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల వసతి గృహాలలో బాలికలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వసతి గృహాలలో సిబ్బందితో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అంజయ్య, వైద్యసిబ్బంది హెల్త్ అసిస్టెంట్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం


బక్కమంతులగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యశోదారెడ్డి, నాయకులు

మఠంపల్లి : ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు, ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజల గుండెల్లో నేటికీ చిరస్మరణీయంగా నిలిచాయని వైఎస్సార్ టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోదారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బక్కమంతులగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వైఎస్సార్ కుమార్తె, వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిలకు రాష్ట్రంలో గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు జిల్లేపల్లి వెంకటేశ్వర్లును ప్రకటించారని, వైఎస్సార్ అభిమానులు, ప్రజలు అతని గెలుపునకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మఠంపల్లి మండల అధ్యక్షుడు మైలబోయిన కొండలు, హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల అధ్యక్షులు మర్రి రవీందర్‌రెడ్డి, అంచూరి పిచ్చిరెడ్డి, మోర్తాల నాగిరెడ్డి, నాయకులు ఉస్తెల అంకిరెడ్డి, సింగతల రంగారెడ్డి, గురువారెడ్డి, రామకోటమ్మ, నాగేంద్ర, లింగయ్య పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : సీఎం సహాయ నిధి పేదలకు వరం అని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్స చేయించుకున్న ఆరుగురికి మంజూరైన రూ.1.33 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్థానిక కౌన్సిలర్లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కేఎల్ఎన్‌రావు, వి.నాగేశ్వరరావు, ఎడ్ల విజయ్, వార్డ్ ఇన్‌చార్జ్‌లు, పట్టణ యువజన కమిటీ సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత


సైకిళ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, రోటరీ క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమరవరంలో మిర్యాలగూడ రోటరీ క్లబ్ అధ్యక్షుడు గౌరు దయాకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల బాలికలకు సర్పంచ్ గుజ్జుల సుజాతతో కలిసి సైకిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ అన్నెం శౌరిరెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పురుషోత్తమరావు, సోమశేఖర్, సైదిబీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విద్యార్థులు ఉన్నారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత


హుజూర్‌నగర్ : చెక్కు అందజేస్తున్న డాక్టర్ శివప్రసాద్, రూప

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన శ్రీ వెంకటేశ్వర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రావూరి శివప్రసాద్ సతీమణి రావూరి రూప బుధవారం తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థి వడ్లమూడి రేవంత్ కాలేజీ ఫీజుకు రూ.25 వేల ఆర్థిక సహాయం చేశారు. సదరు చెక్కును విద్యార్థి తండ్రి మస్తాన్‌కు అందజేశారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

హుజూర్‌నగర్ : పట్టణంలో నిరుపేద అయిన మహంకాళి సుమలత కుమారుడు జగదీష్ డిగ్రీ కళాశాలలో ఎంఎల్‌టీ మెమో తీసుకునేందుకు గాను ఆర్థిక ఇబ్బందులు పడుతుంటడంతో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు బుధవారం రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మాజీ అధ్యక్షుడు జూలకంటి నర్సిరెడ్డి, సభ్యులు దేవదానం, కలిమెల లక్ష్మయ్య, ఎండీ మోహినుద్దీన్, అల్వాల చంద్రయ్య, ఎంఎస్ఎన్ రాజు ఉన్నారు.

దాతల సహకారంతో డొంకదారులకు మరమ్మతులు


పొలాలకు వెళ్లే దారిని బాగు చేసుకుంటున్న గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండా నుంచి శ్మశాన వాటిక, ఆంజనేయస్వామి దేవాలయం, పొలాలకు వెళ్లే డొంకదారులు కంపచెట్లు, బండరాళ్లతో అస్తవ్యస్తంగా తయారవడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు భంగ్యానాయక్, స్థానిక స్వచ్ఛంద చైర్మన్ భూక్యా కోటేష్‌నాయక్ సహకారంతో బుధవారం గ్రామస్తులు ఆయా డొంక దారులను బాగు చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు హనుమాన్‌నాయక్, సక్రియానాయక్, దూబ్లానాయక్, నాగు, మందా, లచ్చిరాం, మోతీలాల్, రవీందర్, లాలు, నాగేంద్రబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటు నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ టి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల 19లోపు దరఖాస్తులు చేసుకోవాలని, ఈ నెల 26, 27 తేదీలలో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన సర్పంచ్‌లు

చిలుకూరు : మండల నూతన తహసీల్దార్ సరితను బుధవారం మండలంలోని సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల సమగ్రాభివృద్ధికి సహకరించాలని ఆమెను కోరారు. ప్రజాప్రతినిధులుగా తాము పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మఠంపల్లి : మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం గ్రామాల పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ హరీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మఠంపల్లి ప్రధాన రహదారిపై గల 11 కేవీ చౌటపల్లి ఫీడర్ కండక్టర్‌ను మారుస్తున్న కారణంగా మఠంపల్లి, చౌటపల్లి ఫీడర్స్‌కు ఎల్‌సీ తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి యత్నం

- బీజేపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు


హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు


కోదాడ : బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

హుజూర్‌నగర్ : అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా నాయకులు కోరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడి చేపట్టారు. దీంతో పోలీసులు వారికి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు అయినా పేదలకు ఇళ్లు పంపిణీ చేయలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అంబళ్ల నరేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి గుండెబోయిన వీరబాబు, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు జి.రామకృష్ణ, కుందూరు కోటిరెడ్డి, కీత శ్రీను, పి.విజయ్, జె.శ్రీనివాస్, గోపి, ఉమామహేశ్వరరావు, ప్రవీణ్, సోమయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్ఎస్

కోదాడ : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కోదాడలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. కార్యాలయం సమీపంలోకి బీజేపీ నాయకులు చేరుకోగానే పోలీసులు వారిని అడ్డుకొని రూరల్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బీజేపీ నాయకులను అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఓర్సు వేలంగిరాజు, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, శ్రీనివాసరెడ్డి, పుల్లారావు, లతీఫ్, కృష్ణప్రసాద్, శ్రీరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ, నిర్మాణం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, ఇళ్ల ముట్టడికి బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మండలంలోని బీజేపీ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు లాజరు, లక్ష్మణ్‌నాయక్, నాగేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కోదాడ : పేద ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసిన కుక్కడపు ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం దివంగత నాయకుడు కుక్కడపు ప్రసాద్ మూడవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య, బెల్లంకొండ సత్యనారాయణ, డాక్టర్ సూర్యనారాయణ, నళిని తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచారికి నివాళి

నడిగూడెం : మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు బైరోజు వెంకటాచారి (54)ని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం సమీపాన బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అకాల మృతి పట్ల కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మల్లెబోయిన మల్లేష్, వైస్ చైర్మన్ గుండోజు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు మోతీలాల్, వేణు గోపాలరావు, అశోక్, ఉమాపతి, అక్షపతి, షాకీర్ భేగ్, వెంకటరెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి


హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి ఎంపికైన ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని ఆహ్వానిస్తూ గురువారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గంగమ్మ గుడి దగ్గర నుంచి హుజూర్‌నగర్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు జె.శంబయ్య, డి.మంగమ్మ, ఎం.రామ్‌గోపి, ఫణికుమారి, నాయకులు అమర్‌గౌడ్, కేఎల్ఎన్ రెడ్డి, అట్లూరి హరిబాబు, వీరారెడ్డి, రామ్‌రెడ్డి, కె.సైదులు, చంద్రమౌళి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డికి మరోసారి టికెట్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండలంలోని చిల్లేపల్లి వద్ద గల మూసీ నది నుంచి హుజూర్‌నగర్ వరకు జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు కోరారు. బుధవారం స్థానిక పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన తర్వాత నియోజకవర్గంలోకి అడుగు పెడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, చిత్తలూరి సైదులు, గుర్రం మార్కొండేయ, బాషా, వెంకటేశ్వర్లు, ఆదిరెడ్డి, భరత్, అశోక్‌రెడ్డి, నారాయణ, రాములు, మల్లయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, లూకాస్, సైదులు ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెంలో బుధవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం మండల శాఖ అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుందరి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బొంత చంద్రారెడ్డి, కందిమళ్ల సైదులు, జానయ్య, కృష్ణారెడ్డి, సందీప్, రవికుమార్, నిమ్మల శ్రీనివాస్, ఆదినారాయణ, రమేష్, రాజశేఖర్, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా..

- మన ఊరు– మనబడితో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- దాతల సహకారంతో సౌకర్యాలు
- ఆహ్లాదాన్ని పంచుతున్న పరిసరాలు


సిరిపురం ప్రాథమిక పాఠశాల


దాతలు అందజేసిన క్రీడా వస్తువులతో ఆడుకుంటున్న విద్యార్థులు

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్న ఈ తరుణంలో మండలంలోని సిరిపురం కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో పాఠశాలను అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పాఠశాలను నిర్వహిస్తున్నారు.

నందనవనాన్ని తలపించేలా..

పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం మన ఊరు–మన బడి పథకం కింద ఏడున్నర లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు, తాగు నీటి సౌకర్యం, తరగతి గదులలో బెంచీలు, కుర్చీలు, పాఠశాలకు రంగులు, నందనవనాన్ని తలపించేలా మొక్కలు నాటడం, ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కాగా పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 61 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

దాతల సహకారంతో ఆట వస్తువులు..

పాఠశాలలో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు అదే గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వాసికర్ల సత్యనారాయణ స్మారకంగా ఆయన చిన్న కొడుకు వాసికర్ల కమల ప్రసాద్ రూ.2.50 లక్షల వ్యయంతో క్రీడా సామగ్రి అందజేశారు. దీంతో విద్యార్థులు చదువుతో పాటు సమయం దొరికినప్పుడల్లా ఆటలు ఆడుకుంటున్నారు. అలాగే విద్యార్థులకు చిన్న నాటి నుంచి కంప్యూటర్‌పై అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో కంప్యూటర్, ప్రింటర్ కూడా ఏర్పాటు చేశారు. గుంటి మధు సహకారంతో మైక్, టీవీ ఏర్పాటు చేశారు. బెంచీలు అందజేశారు.

సౌకర్యాలు బాగున్నాయి



మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు బాగున్నాయి. చదువుతో పాటు ఆటలు నేర్పిస్తున్నారు. బెంచీలు, కుర్చీలు కూడా ఏర్పాటు చేశారు. తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. మాకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

– రాయపూడి ఉషశ్రీ, 5వ తరగతి విద్యార్థిని

అన్ని వసతులున్నాయి



మా గ్రామంలోని కాలనీ ప్రాథమిక పాఠశాలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు ఆటలు కూడా నేర్పుతున్నారు. ఆ పాఠశాల నందనవనాన్ని తలపిస్తోంది. విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయి.

– మొక్క సాంబయ్య, సిరిపురం

అందరి సహకారంతో అభివృద్ధి



గ్రామ పెద్దలు, దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం. మన ఊరు –మన బడి పథకం కింద విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాం. ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా పాఠశాల ప్రాంగణంలో రెండున్నర లక్షల రూపాయల వ్యయంతో క్రీడా సామగ్రి ఏర్పాటు చేయడంతో పాఠశాలకు కళ సంతరించుకున్నది.

– కన్నెగంటి సుజాత, ప్రధానోపాధ్యాయురాలు